కథ

# తల్లిపాలు వేలపాలు

డి. కామేశ్వరి

"తాగవే తల్లీ, తొందరగా తాగవే అమ్మా - నాకన్నా, బంగారు తల్లివిగా, నాకు టైము అయిపోతోంది, బస్సు వచ్చేస్తుందమ్మా, తాగవే తొందరగా, ఏం పిల్లవే రెండు గుటకలు మింగుతావో లేదో కళ్ళు మూసేస్తావు, మళ్ళీ అరగంటకే ఆకలికి ఏడుస్తూ లేస్తావు. కడుపునిండా తాగవే తల్లీ, ఇవాళ నుంచి నాకు ఆఫీసు, మళ్ళీ సాయంత్రం వరకూ అమ్మ పాలుండవు. బుద్ధిపాలే. అంతే! ఏడ్చి రాగాలెట్టినా నీకు అమ్మ పాలుండవు. తాగు మరి.." పాపని కుదిపి లేపాలని ప్రయత్నిస్తోందాతల్లి. బుగ్గమీద చిటికేసినా, చెవి నెమ్మదిగా నులిమినా, తొడమీద గిలిగింతలు పెట్టినా, ఏంచేసినా ఒక్కసారి ఉలిక్కిపడి, మళ్ళీ చప్పరించి మళ్ళీ కళ్ళు మూస్తోందా పాప. అదేం ఖర్మో ఇన్ని పాలు తాగవే, నోట్లో పెట్టుకోగానే నిద్రముంచుకువస్తుందేమో నీకు" తల్లి విసుక్కుంటూ బిడ్డని పక్కమీద పడుకోబెట్టి జాకెట్ సరి చేసుకుని లేచి నుంచుంది.

ఆఫీసుకి వెళ్ళేలోగా బిడ్డకి కడుపునిండా పాలివ్వాలని ఆ తల్లి ఆరాటం! నెళ్ళాళ్ళ పసిగుడ్డుని వదిలిపెడ్తున్నందుకు ఓ పక్క బాధ - కడుపు నిండా తాగితే ఓ రెండు మూడు గంటలన్నా నిలుస్తాయి. మళ్ళీ సాయంత్రం వరకు పోతపాలేగా గతి అన్న తాపత్రయం ఆ బాలెంతది! 'ఉద్యోగాలే చేస్తావో, రాజ్యాలే ఏలతావో నాకేల. ఆకలేస్తే మళ్ళీ లేస్తాగానీ ఇప్పుడు నన్ను వెచ్చగా, నీ వళ్ళో, నీ కొంగు చాటున పడుకోనీయి' అన్నట్టు గుప్పిళ్ళు, పెదాలు మూసి ఇంక తాగను అన్నట్టు కళ్ళు మూసుకున్న పాప- తల్లీకూతుళ్ళ వరస చూసి తల్లి తల్లి నవ్వింది. నలుగురి బిడ్డలని కన్న తల్లి. మొదటి కానుపు కూతురు ఆరాటం చూసి నవ్వింది. "ఏమిటే నీ పిచ్చి! చంటి పిల్లలంతే. నీ దగ్గర పాలున్నాయని అన్నీ ఒకసారి తాగేస్తుందా, నీవాఫీసుకి వెడ్తావని సాయంత్రం దాకా కావల్సినవన్నీ ఒకసారి తాగమంటే తాగుతుందా! వాళ్ళ చిన్న పొట్టకెంత కావాలే! ఉగ్గు గిన్నెడు పాలు చాలు. తల్లి వళ్ళో పడుకుని రెండు గుక్కలు తాగగానే తృప్తితో వాళ్ళ కళ్ళు మూతపడతాయి"

"అది కాదమ్మా యిన్ని పాలున్నా అసలు తాగనే తాగడం లేదు" కూతురు అమాయకంగా కంప్లెంటు.

"అంతేనే, మన దగ్గర పుష్కలంగా పాలున్నప్పుడు వాళ్ళు తాగలేరు. వాళ్లు తాగడం మొదలుపెట్టేసరికి మన దగ్గర పాలు తగ్గుతాయి. ఒకసారి తాగలేరనే కదూ గంటగంటకివ్వడం! రెండో నెల వచ్చాక ఇంకాస్త తాగుతారు. ఇప్పుడు ఔన్సుడి పాలు చాలు వాళ్ళ పొట్ట నింపడానికి" తల్లి వివరించింది. "బయలుదేరు, తొమ్మిదిన్నర అయింది. మళ్ళీ బస్సు వెళ్ళిపోతుంది".

"అమ్మా బాటిల్స్ స్టెరిలైజ్ చేసిపెట్టా, పాలు బాగా కాచి చల్లార్చాను, ఒక వంతు వేడి నీళ్ళు కలపమంది డాక్టరు..." తల్లికి అప్పగింతలు మొదలుపెట్టుతూంది కూతురు.

"తెలుసే బాబూ నాకు, ఆ మాత్రం తెలీదూ నాకూ, నీవెళ్ళు ముందు" నవ్వుతూ అంది తల్లి. కూతురి వంక ఒకసారి చూసుకుని విడవలేక వెడ్తున్నట్టుగా చెప్పల్లో కాళ్ళు దూర్చింది ఆ తల్లి, బాలెంత తల్లి మీనాక్షి!

*** *** ***

టైపు చేసిన కాగితాలలో తప్పులు వెదుకుతూంటే, కాగితాలు తడిసి అక్షరాలు అలుక్కుపోయాయి. కళ్ళు మసకేశాయా, కళ్ళ జోడు మసకేసిందా? అన్న అనుమానం వచ్చి కళ్ళ జోడు తీసి కొంగుతో తుడిచి మళ్ళీ పెట్టుకున్నా అక్షరాలు తడిసి అలుక్కుపోయే వున్నాయి. నీళ్ళెక్కడనించి పడ్డాయి? అని అయోమయంగా చూస్తూంటే అవి నీళ్ళు కావని, అవి జాకెట్లోంచి కారుతున్న చనుబాలన్నది అర్థం కావటానికి నిమిషం పట్టింది మీనాక్షికి. గాబరాపడిపోయింది. కారుతున్న పాలతో జాకెట్టు తడిసి కింద వళ్లో చీర మీద కూడా పడిన పాలని చూసి తెల్లబోయి గాభరాగా కొంగు తీసి చుట్టూ కప్పకుని చటుక్కున లేచి బాత్‌రూమ్ వైపు పరుగెత్తినట్టే వెళ్ళింది. ఇందాక వరం ఒక గుంజినట్టు అనిపించి నొప్పి అనిపించింది. ఏమిటో అనుకుంది తను. జాకెట్టు అంతే. అందునా లేత రంగు జాకెట్టేమో తడిసి మరకలు కట్టి బంకబంకగా అయింది. ఏం చెయ్యాలో తోచలేదు మీనాక్షికి. రుమాలు తడిపి అంతా తుడుచుకుని చేసేదేం లేక కొంగు నిండా కప్పకుని మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుంది. ఎవరి పనిలో వారున్నారు. తనని చూడలేదు నయమే అనుకుంది. ఇలా కారిపోతాయా పాలు! గుండెలన్నీ బరువెక్కి రాయిలా తయారయింది. పిల్ల పాలు తాగలేదని యిలా అయిందా!...సందేహాలు అడుగుదామన్నా తన సెక్షన్లో ఇద్దరూ పెళ్ళి కాని అమ్మాయిలే! పిల్ల తల్లులు లేరు. రోజూ యిలా అవుతుందా! ... అమ్మో...మరేం చెయ్యాలి?

"పొద్దుట ఇచ్చాక మళ్ళీ ఇంటికొచ్చాకేగా! ఇంట్లో వుంటే నాలుగయిదు సార్లన్నా తాగేది కదా పాప. పాలు నిండిపోతే చేపొస్తాయి. పిల్ల ఆకలి వేళ అయినట్టు అనుకునేవారం ఇదివరకయితే. గిన్నె నిండిపోతే పాలు ఒలకవూ! ఇదీ అంతే! అందులో నెల్లాళ్ళ బాలింతాయె. పాలుండిపోవూ మరి...

"ఇవాళ ఎంత అవస్థపడిపోయావో, లేత రంగు జాకెట్టు, జాకెట్టంతా డాగులు కట్టేసింది. పమిట కప్పకుని తంటాలు పడ్డాను. మళ్ళీ సాయంత్రమూ బస్సు స్టాపులో నించున్నప్పుడూ కారిపోయాయి. ఎలాగమ్మా ఇలా రోజూ అయితే! ఇంటికొచ్చి తల్లితో చెప్పకుంటూ దిగులుగా అంది మీనాక్షి.

"ఏమిటోనే తల్లీ. మీ ఉద్యోగాలూ, మీరూనూ! నెల్లాళ్ళ పసిగుడ్డుని ఎనిమిది గంటలపైన వదిలి వెడితే పాలు చేపురాక ఏం చేస్తాయే? పోతే పోయింది జీతం! కనీసం మూడో నెల వచ్చేవరకన్నా సెలవు పెట్టి ఇంటి పట్టున వుండు. పచ్చి బాలెంతవి. వంటి తడన్నా ఆరకముందే బస్సులు పట్టుకు వేలాడి ఆఫీసులకి పరుగెత్తడం. మా కాలంలో ఇరవై ఒకటో రోజు వరకు మంచం దిగనిచ్చేవారు కాదు. నలభై రోజుల వరకు చన్నీళ్ళలో చేయి పెట్టనిచ్చేవారు కాదు. నెలరోజులు శొంఠి పొడుం అన్నం, గిన్నెడు నేయి వేసి వళ్ళు గట్టిపడాలని పెట్టేవారు. నెల్లాళ్ళూ నడుం కట్టుకునేవారం. నలభై రోజులకి గానీ వంటింట్లోకి అడుగుపెట్టనిచ్చేవారు కాదు. ఏం రోజులొచ్చాయో..నెలలు నిండేవరకు బస్సులో పడి ప్రయాణాలు చేస్తున్నారు. నెల్లాళ్ళ పసిగుడ్డుకి పాలు ఇచ్చుకోకుండా వేలపాలు చేసుకుంటున్నారు పాలు" వరలక్ష్మి నిట్టూర్చి అంది. "సెలవు పెట్టవే ఓ నెలన్నా..చూడు బాలింతరాలివి ఎలా తోటకూర కాడలా వాడిపోయావు" కన్నకడుపుతీపి ఆవిడది. "నీ సంగతి సరే, ఆ పసిది తిత్తి నోట్లో పెడితే వెగటుగా మూతి పెట్టి పాలు తాగనే లేదు.



పాలసీసా పీక నోట్లోంచి తీసేసింది...ఆకలికి ఒకటే 'ఏడుపు.."

"పాలు తాగలేదా మరి పొద్దుటమంచీ?" ఈ కన్నతల్లి ఆరాటం.

'రెండు మూడు సార్లు ప్రయత్నించి తాగకపోతే చంచాతో కాసిని పట్టాను బలవంతంగా..అందుకే బాటిల్ అలవాటు చెయ్యవే మధ్య మధ్య అన్నాను. కాసిని నీళ్ళు బాటిల్లో పడుతుండాలి అలవాటవ డానికి. పద అది లేచేలోగా కాస్త ఏదన్నా కాఫీ తాగు, కాళ్ళు కడుక్కురా" వరలక్ష్మి వంటింటి వైపు వెడుతూ అంది.


కాఫీ తాగుతూ "మరి ఈ పాలు ఇలా కారితే ఆఫీసులో ఎలా అమ్మా? ఏం చేయాలి? అస హ్యంగా, ఎవరన్నా చూస్తే సిగ్గుతో చావాలి" అంది మీనాక్షి.

"సెలవన్నా పెట్టి ఇంట్లో వుండు. మూడో నెల తరువాత కాస్త తగ్గుమొహం పడతాయి. లేదంటే డాక్టరుని మందు అడుగు పాలు తగ్గడానికి. మాత్ర వేసుకుంటే పాలు అసలుకే పోతాయేమో చూసుకో. ఏం చేస్తావు? మూడుగంటలకోసారి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి కాసిని పిండి పారబోసుకో.. ఇంకో జాకెట్టు బ్యాగులో పెట్టుకో. అవసరం పడితే వుంటుంది. మధ్య మధ్య బాత్‌రూమ్‌కి వెళ్ళి వస్తుంటే చేవు రావులే" అంది వరలక్ష్మి.

"సెలవు పెట్టడానికి వుంటే ఇన్ని తిప్పలెందుకు?" అన్నది. మీనాక్షికి తెలుసు మెటర్నిటీ లీవు మొత్తం మూడునెలలూ పిల్ల వుట్టాక తీసుకుందాం అను కుంది. కాని ఎనిమిది నెలల నించి బ్లీడింగు ప్రాబ్లమ్ మొదలు పెట్టగానే డాక్టరు కంప్లీట్ బెడ్ రెస్ట్ అనడంతో నెలా ఇరవై రోజులు ముందే సెలవు గడిచిపోయింది. పెళ్ళయ్యాక పిల్లలు వద్దనుకుంటూ రెండేళ్ళు, కావాలనుకున్నాక మరో రెండేళ్ళు గడిచిపోయాయి. ప్రెగ్నెన్సీ మొదలైంద గ్గరనుంచీ మూడో నెలలో థ్రెటనింగ్ అబార్షన్. వదలడానికి వీలు లేక అప్పుడే నలభై రోజుల సెలవు పోయి ఎరెండ్ లీవ్ అయిపోయింది. ఇప్పుడింక పెడితే జీతం నష్టం మీద పెట్టాలి. ఆ మాట అనగానే సుబ్బారావు గాబరాగా "జీతం నష్టం మీద సెలవు పెడితే ఇంటి అప్పు ఎలా తీరుస్తాం" అన్నాడు. సుబ్బారావుకి నాలుగు వేల ఎనిమిది వందలు, మీనాక్షికి మూడువేల ఎనిమిది వందలు జీతాలొస్తాయి. భార్య జీతం వచ్చింది వచ్చినట్టు మూడున్నర లక్షలు పెట్టి కొన్న ఫ్లాట్‌కి తెచ్చిన లోను తీర్చేస్తాడు. తన జీతంతోనే ఇల్లు గడుపుతాడు. కూడబెట్టి ఇల్లు కొనడం అప్పుది పట్టిమాట. ఇలా అప్పులు తెచ్చుకుని కొనవల సిందే ఇల్లు. సరే పిల్లలు పెద్దవాళ్ళయ్యేలోగా ఇంటిమీద అప్పు తీర్చేయచ్చు అనుకుంది మీనాక్షి. "నెల్లాళ్ళ బాలింతని అప్పుడే ఆఫీసేమిటని" మీనాక్షి గొణిగింది డ్యూటీలో జాయిన్ అవ్వాల్సిన రోజు వచ్చేసరికి. "మన ప్రాబ్లమ్స్ మనవి. ఆవిడకేం అర్థమౌతాయి? అప్పు తీర్చడానికి, ఇంటి ఖర్చుకి నా జీతం సరిపోతుందా? ఓ నెల కట్టకపోతే బ్యాంకు వాళ్ళు వూరుకోరు. అదీ కాక రెండో నెలకి డబుల్ అవుతే అప్పుడు మాత్రం ఎలా కడతాం? ఏం చేస్తాం? అందరు ఆడవాళ్ళు కనడం లేదా? వెళ్ళడం లేదా?" అన్నాడు సుబ్బారావు. ఇంక అనడానికి ఏం మిగలలేదు మీనాక్షికి.

*** *** ***

"ఏమిటమ్మా..పిల్లకి ఇన్ని విరోచనాలు వెడితే డీ-



## దర్శకుడిగా మారుతున్న నసీరుద్దీన్‌షా

విలక్షణ నటనతో విభిన్నమైన పాత్రలు చేయగల సత్తా వున్న నటుడుగా పేరు పొందిన నసీరుద్దీన్ షా ఇప్పుడు దర్శకత్వం వైపు కూడా దృష్టి సారించాడు. దినేష్ గాంధీ సమర్పిస్తున్న ఓ చిత్రం కోసం కథా చర్చలలోను, స్క్రిప్టు తయారు చేయడంలోను ప్రస్తుతానికి నసీరుద్దీన్ చాలా బిజీగావున్నాడు. కొన్నాళ్ల క్రితం వరకూ దర్శకత్వం అంటే విముఖత చూపిన నసీరుద్దీన్ ఇప్పుడెందుకో దానిపై అంత ఇష్టం ప్రదర్శిస్తున్నాడు.

హైడ్రేట్ అయిపోయేవరకు డాక్టరు దగ్గరకి తీసుకువెళ్ళాలని తెలియదా? మళ్ళీ చదువుకున్నవాళ్ళు మీరు" డాక్టర్ మెత్తమెత్తగా మందలించింది. పోత పాలు ఆరంభించగానే పడక విరోచనాలు మొదలైతే ఇంట్లో తల్లి కొత్తపాలు అలవాటవడానికి నాలుగు రోజులు పడ్తుందే అంటే సరేవనుకుంది. విరోచనాలు తగ్గకపోగా ఎక్కువై పిల్ల నీర్సంగా వేలాడిపోతూంటే ఆఫీసుకి సెలవు పెట్టి డాక్టరు దగ్గిరికి తీసుకొచ్చింది మీనాక్షి.

'అప్పడే పోతపాలెందుకు మొదలుపెట్టారు? ఏం పాలు లేవా? తగ్గిపోయాయా?"

"పాలున్నయి డాక్టరుగారూ. ఆఫీసుకి వెళ్ళినప్పుడు మూడు నాలుగు ఫీడ్లు పోతపాలు పడ్తున్నాం."

"అప్పడే ఆఫీసా! మూడు నెలల వరకు సెలవు వుంటుందిగా..?"

"సెలవు ముందు చాలా అయిపోయింది" అంటూ అంతా చెప్పకొచ్చింది.

"అట్లా అయితే, పాలున్నప్పడు బాటిల్స్‌లోకి తీసి ఫ్రిజ్‌లో పెట్టి రెండు మూడు సార్లు పట్టచ్చు గదా..ఆఫీసుకి వెళ్ళేముందు బాటిల్స్‌లో కలెక్ట్ చేసి పెట్టండి".

మీనాక్షి ఆశ్చర్యంగా చూసింది. ఆ విషయం ఆమెకి కొత్త...అలా పట్టొచ్చా..నాకు తెలియనే తెలీదు. బాటిల్స్‌కి వస్తాయా పాలు!

"బ్రెస్ట్ రికవరీ అని మెడికల్ షాపులో దొరుకుతాయి. పంపు చేస్తే ప్రెషర్‌కి పాలు సీసాలో కారుతాయి. అసలు పిల్లలు పోయిన వారికి కదుము కట్టి బాధగా వుంటే పాలు పిండి పారబోసేందుకు బ్రెస్ట్ రికవరీ వాడతారు. మీరు అది వాడండి. పాలు పట్టి ఫ్రిజ్‌లో పెట్టుకుని పాపకి రెండు మూడు ఫీడ్లు పట్టండి. కనీసం విరోచనాలు తగ్గేవరకన్నా..ఈ మెడిసిన్ వాడండి, మధ్య మధ్య కాచి చల్లార్చిన పంచదార, ఉప్పనీళ్ళు వాడండి" డాక్టరు అంది.

"బాగానే వుంది. ఆవులు, గేదెల పాలు పిండుకున్నట్టు మనుష్యుల పాలు పిండుకుని దాచుకోవడం..వరలక్ష్మి నవ్వింది. ఏం రోజులొచ్చాయి..తల్లి వళ్ళో పడుకుని వెచ్చగా పాలు తాగాల్సిన పిల్లలకి తల్లి పాలు సీసాలో పట్టే రోజులు! ఏం ఉద్యోగాలో, ఏం సంపాదనలో.." విరక్తిగా నవ్వింది.

మీనాక్షికి నిజంగానే విరక్తేమిటి? కోపం, నిస్పృహాయత చుట్టుముట్టాయి. చేతులు, రొమ్ములు నొప్పి పెట్టేట్టు పాలు పిండుకుంటుంటే! ఆవు దూడకి చుక్క పాలు వదలకుండా ఆఖరి బొట్టుకూడా పిండుకునే పిసినారి పాలవాడిలా, వున్న ఆఖరి బొట్టు వరకు, ఇంకా పిండితే రక్తమే వస్తుందేమో నన్నంతగా, నొప్పి భరిస్తూ పాలు పిండుకుంటూంటే భరించలేని నిర్వేదం చుట్టుముట్టింది. ఎందుకీ పిల్లల్ని కనడం? కడుపు నిండా పాలైనా ఇచ్చుకోలేని తల్లులకి పిల్లలెందుకసలు? తమకీ అవస్థ ఏమిటి? ఇంత అవస్థ పడి ఈ ఉద్యోగాలెందుకు చేయడం? ఇదంతా స్త్రీల అభ్యున్నతి అనుకోవాలా! స్త్రీల ఆర్థిక ప్రగతి అనుకుని సంతోషించాలా? ఏం ఆర్థిక ప్రగతి? ఏం ఆర్థిక స్వాతంత్ర్యం సాధించింది తను? తెచ్చిన జీతం తెచ్చినట్టు మొగుడి చేతిలో పోస్తూంది. యింటి కోసం ఫ్రిజ్ కోసం, టీవీల కోసం, గ్రైండర్ల కోసం, కుక్కర్ల కోసం.. ఏమన్నా అంటే ఇదంతా మీ కోసమే, మీ సుఖ సంతోషం కోసమే, మీ సౌకర్యాల కోసమే మా తాపత్రయం అనే మొగుళ్ళు...మరి నోరెత్తకుండా రాటకి గట్టిన గానుగెద్దుల్లా గుడ్డిగా రాట చుట్టూ వలయంలా, ఈ ఉద్యోగాల చుట్టూ తిరిగే తాము–

"ఏమిటే, అడుగుతుంటే వినిపించుకోవు. ఏమిటా ఆలోచన?" వరలక్ష్మి మాటలకి–

"ఏం లేదమ్మా..పాలు సీసాల్లో దాచుకోడం గురించి ఆలోచిస్తున్నా..రేప్పొద్దున "ప్రశస్తమైన తల్లి పాలు ఇచ్చట దొరుకును" అని బోర్డులు పెట్టి తల్లి పాలు అమ్ముకానికి పెట్టే రోజు వస్తుందేమో? పాలు పిండి, ఫ్రీజర్లో పెట్టి అమ్ముతారేమో! ఇంకా కొస్త ముందు వెళ్ళి పాలు పాస్చరైజ్ చేసి పాశ్చరైజ్‌డ్ మిల్క్‌గా ఉద్యోగ తల్లుల పిల్లలకి కొనుక్కోవచ్చేమో!' విరక్తిగా నవ్వుతూ అంది.

"బాగానే వుంది ఆలోచన..ఏమో నువ్వన్నట్టు ఆరోజులూ వస్తాయేమో"

"ఏమిటమ్మా! వుత్తప్పుడు వూరికే కారిపోతుంటాయి. పిండితే ఆరు ఔన్సులకన్నా రావటం లేదు..రెండు సీసాల్లో మూడు ఔన్సుల చొప్పున పెట్టి ఫ్రిజ్‌లో పెట్టింది మీనాక్షి.

"పిల్ల తాగుతూంటే చేపొచ్చి ఊరుతాయి. ప్రకృతి సహజమైన దాన్ని మనం విరుద్ధంగా చేస్తే అంతే. అయినా పిల్ల తాగితే ఎన్ని తాగుతుందీ మనకు తెలీదా? అది కొస్త తాగాక మళ్ళీ వస్తాయి కాని అన్నీ ఒక్కసారే పిండుకుని సీసాల్లో దాచుకుంటాం అంటే లీటర్ల కొద్దీ వస్తాయేమిటి పిచ్చిదానా! సర్లే ఇవి రెండు మూడు సార్లకి సరిపోతాయా? మధ్యలో కాసిని నీళ్ళు పడ్తుంటాలే" అంది వరలక్ష్మి.

*** *** ***

తల్లి వెళ్ళిపోయే రోజు దగ్గరపడుతూంటే గుండెల్లో గుబులు మొదలైంది మీనాక్షికి. తల్లిని వదల్లేని బెంగ కాదది. కూతుర్ని క్రెష్‌లో వదలాలన్న బాధ, బెంగ అది! ఇంత పసిగుడ్డుని ఉదయమే తయారు చేసి పాల సీసాలు, నీళ్ళ సీసాలు, గుడ్డలు అన్నీ మూట కట్టి మైలు దూరంలో వున్న క్రెష్‌లో వదిలి, సాయంత్రం మళ్ళీ మళ్ళీ తెచ్చుకుని, మళ్ళీ వండుకుని...చాకిరి తల్చుకుంటే ఏడుపు వచ్చింది. పాలతో గుండెలు, దిగులుతో మనసు బరువెక్కాయి.

"ఎలా అమ్మా నీవెళ్ళిపోతే" బెంగతో కళ్ళు తడి అయ్యాయి.

"ఏం చెయ్యనే, ఎన్నాళ్ళుండగలను..అక్కడ మీ నాన్న గారు ఇబ్బంది పడ్తున్నారు ఒక్కరూ. ఏమిటో పుట్టింటికొచ్చి పురుడు పోసుకోవడం, మూడో నెల వెళ్ళడం ఏమీ లేకుండా ముందు నుంచి మంచం ఎక్కావు. ఇవాళ కాకపోతే రేపైనా వెళ్ళాలి. ఎన్నాళ్ళుంటాను? ఇంక నీ పాట్లు నీకు తప్పవు.ఆ క్రెష్ వాళ్ళతో మాట్లాడి డబ్బు ఇచ్చిరా ఇవాళ" అంది వరలక్ష్మి నిట్టూర్చి.

*** *** ***

తమ కంపెనీ ఇంకో బ్రాంచిలో పనిచేస్తున్న రేవతి తమ అపార్ట్‌మెంట్స్ లోనే వుంటుంది. ఒకే అపార్ట్‌మెంట్స్‌లో వున్నా వచ్చి మాట్లాడుకునే తీరిక, టైమ్ లేదు ఇద్దరికీ. ఆరోజు తన కొడుకు మొదటి పుట్టిన రోజు పేరంటం అంటూ పిలవడానికి వచ్చిన రేవతి "మీ అమ్మగారు వెళ్ళిపోయినట్టున్నారు. ఎలా

మేనేజ్ చేస్తున్నారు? క్రెష్‌లో జాయిన్ చేశారా? అదే నయం లెండి. ఈ పనిమనుష్యుల మీద పది లేకంటే. ఇంట్లో మనిషిని పెట్టి వెడితే వున్నారా? ఇల్లు దోచుకుపోయారా? పాలు పట్టారా? లేక తాగేశారా? అని అన్నీ బెంగలే" అంది నవ్వుతూ తనకంటే అనుభవం వున్న ఉద్యోగిని తల్లి కన్పించేసరికి ఆరాటంగా మీనాక్షి ప్రశ్నలు కుప్పించి ఆరాలు తీసింది.

"బాగా అంటే మనలా వుంటుందా?"

" యజమానురాలు మంచిదైనా ఆయాలు కాస్త దయగలవారైతే బాగానే చూస్తారు. కనీసం వేళ పట్టున పాలు అవి పడతారు లెండి. మన పిల్లలు మనకే విసుగు. పదిమంది పిల్లల్ని చూడాల్సిన చోట వాళ్ళకీ విసుగే మరి. అవన్నీ ఆలోచించకూడదు. మనసు రాయి చేసుకోవాలి. ఏమయినా మనిషిని పెట్టడం కంటే క్రెష్ నయం అన్ని విధాలా. నేను మనిషిని పెట్టుకుని నానా బాధలు పడి ఆఖరికి క్రెష్‌లోనే జాయిన్ చేశాను".

"ప్చ్! మన ఆఫీసుల్లో క్రెష్ ఏర్పాటు వుంటె ఎంత బాగుండును? ఇలా అవస్థ, ఆరాటం మన కుండవు. ఓ చిన్న రెస్ట్ రూమ్ వుంటే నర్సింగ్ మదర్స్‌కి ఎంత బాగుంటుంది?" ఆశగా అంది.

"రూలు ప్రకారం అన్నీ వుండాలి. ఆడవాళ్ళు ఫిఫ్టీ పర్సెంట్ లేరన్న వంకతో పట్టించుకోరు. ఏదో సెక్రటేరియట్ లాంటి చోట్ల తప్ప ఆఫీసుల్లో క్రెష్‌లు ఎక్కడున్నాయి? కని పెంచే తల్లుల అవస్థలు మనకి తెలుస్తాయి కాని వాళ్ళకేం తెలుస్తాయి?" విరక్తిగా అంది రేవతి. మీనాక్షి తన పాల బాధ, ఆఫీసులో పడిన అవస్థ, మైలు దూరంలో వునన క్రెష్‌లో పాపని విడిచి మళ్ళీ తెచ్చుకునే బాధలు ఏకరువు పెట్టింది. "మన మహిళా విమోచనా సంస్థలు, స్త్రీ సంక్షేమ శాఖలు, స్త్రీవాద సాహితీపరులు, ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్స్ ఇలాంటి వాటిమీద పోరాడితే బాగుండును. స్త్రీలు ఉద్యోగాలు చేసే చోట పది మందున్నా, పదిహేనుమందున్నా నర్సింగ్ మదర్స్ కోసం ఓ చిన్న రూము అన్నా ప్రొవైడ్ చేయాలన్న రూలు ప్రభుత్వం పెట్టేలా చెయ్యాలి" ఉద్రేకంగా అంది మీనాక్షి. "మన అందరం కల్సి ప్రభుత్వానికి అర్జీలు పెట్టాలి, నిలేయాలి" ఆవేశంగా అంది. రేవతి నవ్వి లేచి నిల్చుంది. "సర్లెండి అవన్నీ అయ్యే పనులా!అంత తొందరగా ప్రభుత్వాలు స్పందించేసి మన గోడు పట్టించుకుంటే ఇంకేం కావాలి? సాయంత్రం తప్పకుండా రండి" అంటూ వెళ్ళింది.

అయ్యే పనులా అని అందరూ వూరుకుంటే ఎలా! "అయ్యా ఘనత వహించిన దొరవారూ! మా ఆడ వాళ్ళ అవస్థ వైపు కాస్త కన్నెత్తి చూడండి. జనాభా ... సగం వుండి, పిల్లల్ని కని మీ వంశాభివృద్ధి చేస్తున్న ఆడవాళ్ళ గురించి కాస్త ఆలోచించండి. "తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠము" ప్రతిపాల డబ్బా మీదా అచ్చొత్తించి, ప్రకటనల్లో, టీవీల్లో నినాదాలిస్తూ మాతా శిశువుల సెమినార్లు, మీటింగులు పెట్టి బిడ్డకి తల్లిపాల ఆవశ్యకతని గురించి ప్రబోధించే మీరు ఆ తల్లి పాలు తాగాల్సిన పిల్లల గురించి ఏం ఆలోచిస్తున్నారు? ఉద్యోగాలు చేసి పొట్ట పోసుకునే తల్లుల పిల్లలకి మీరిస్తున్న సదుపాయాలేమిటి? కూలి నాలి చేసుకునే తల్లులు ఏ చెట్టుకో, ఊయల కట్టుకుని, పిల్లలని దగ్గరుంచుకుని పాలిచ్చుకుంటారు. ఆ మాత్రం వీలు కూడా మాకు లేదే! అయ్యా! అంతంత పెద్ద ఆఫీసులు, బిల్డింగులు కట్టే మీరు మాలాంటి తల్లుల కోసం ఎనిమిది బై ఎనిమిది గది ఒక్కటి కట్టించి పుణ్యం చేసుకోకూడదూ! ఆయాలని మీరు పెట్టొద్దు. క్రెష్‌కి కట్టే బదులు డబ్బు తెచ్చి మీకు పెట్టుకుంటాం. పురుష పుంగవులు టీలకి, సిగిరెట్లకి వెళ్ళొచ్చే టైముల్లో మధ్య మధ్య ఓ పది నిమిషాలు బిడ్డకి పాలిచ్చి వస్తాం. కావలిస్తే మేం వృధా చేసిన సమయం బదులు ఓ అరగంట ఎక్కువ పని చేస్తాం. బిడ్డ ఎలా వుందో? పాలు తాగిందా? ఏడుస్తోందా? లాంటి చింతలు లేకపోతే మనసు పెట్టి మరింత బాగా పని చేస్తాం సార్! "మీలాంటి వాళ్ళెంతమంది వుంటారని రూములు కట్టించి ఇస్తాం?" అంటారా. ఎందుకు లేరు సార్! ఈరోజు ఏ ఆఫీసులో చూసినా ఆడ వాళ్ళు లేని ఆఫీసుందా? రోజు గడవని ఇల్లాళ్ళు ఎందరు ఉద్యోగాలు చేయడం లేదు సార్? ఈ గొడవంతా ఎందుకు మీ ఆడాళ్ళు ఉద్యోగాలు, ఊళ్ళేలడాలూ మానేస్తే ఏ గొడవా వుండదుగా అంటారా! మంచిది సార్. అలాగే కూర్చుంటాం. వందేళ్ళు వెనక్కి గడియారాలని తిప్పినట్టు కాలాన్ని వెనక్కి తిప్పేయండి సార్. పిల్లల్ని కంటూ, ఉచ్చ గుడ్డలు మార్చుకుంటూ, పీతి గుడ్డలు ఉతుక్కుంటూ, ఎడ పిల్ల, చంటి పిల్ల, కడుపులో పిల్లతో మొగుడికి, పిల్లలకి వండి వార్చుతూ, అప్పడాలు వత్తుకుంటూ, వడియాలు పెట్టుకుంటూ, సొడులు విసురుకుంటూ, మంగళగౌరీ వ్రతాలు, నంది కేశుడి నోములు నోచుకుంటూ "భర్తే దైవం! ఇల్లే స్వర్గం!" అనుకుంటూ, భర్త తిడితే బాధపడి, ఒడితే ఏడ్చి, దగ్గరకి తీసుకుంటే సంతోషించి, ఏ చీరో కొని ఇస్తే పొంగిపోయి...అదే బతుకను కుంటూ కూపస్థ మండూకాల్లా బతికేస్తాం! అప్పటి ఆడవాళ్ళ అజ్ఞానమే వాళ్ళకి శ్రీరామరక్ష అయి బాధపడకుండా వుండేవారు! ఇప్పుడు జ్ఞానం సంపాదించి మేం సాధిస్తున్నది ఏముందిలెండి! భర్త గారికి సంపాదించిపెట్టి ఆయన బరువు సగం మేమెత్తుకుని ఇంట, బయట నలిగిపోవడం తప్ప! మీ కోరికలు, చీరలు, షోకు ఉ తగ్గించుకుంటే ఇంటిపట్టున వుండొచ్చు. ఆ కాలంలో అరడజను మందిని వంటి చేత్తో పోషించిన మగాడు ఈనాడు ఒకళ్ళిద్దరిని ఎందుకు భరించలేడు! మీరు ఆర్థిక స్వాతంత్ర్యాలు, వ్యక్తిత్వాలు, ఆత్మ గౌరవాలు, స్త్రీ పురుష సమానాలు.. అంటూ కబుర్లు మానేయమంటారా! అవును లెండి. ఎటు తిరిగినా మా మీదకే నేరం తోస్తారు లెండి. ఈ కబుర్లెందుకు సార్! క్రూర జంతువైన పులి లాంటిదే ఆవు తల్లి బిడ్డకి పాలిచ్చి వస్తానంటే దయతలిచి వెళ్ళనిచ్చిందే! ఆమాత్రం కన్సిడరేషన్ జనభాలో సగం వున్న స్త్రీల మీద కు లేదా! ఏం అడిగాం సార్? ఓ చిన్న గది! ప్రతి ఆఫీసు, ఫ్యాక్టరీ, కంపెనీ ప్రతి దానికీ ఆడవాళ్ళకో రెస్టు రూం, పసి పాపలకి పాలిచ్చుకునేందుకు ఓ గది దయచేయించండి. మీ వంశాలని నిలబెట్టే కన్న తల్లులకి, మాతృమూర్తులకీ చిన్నపాటి వరం ఇవ్వండి. "బిడ్డకు తల్లి పాలే శ్రేష్టం' అంటారు మీరు. ఆ తల్లి పాలు నేలపాలు కాకుండా చూడాల్సిన బాధ్యతా మీదే!

రాత్రి నిద్ర పట్టకుండా దొర్లినంత సేపు ఆవేశపు ఆలోచనలు. నిద్ర పట్టాక కలల్లో అర్జీలు పెట్టేసి ప్రభుత్వాన్ని తూర్పార పెట్టేసింది ఆ కన్నతల్లి!

## అక్షయ్‌ఖన్నా

### సర్దుబాటు

ఫైర్ సినిమా తీసి సంచలనం సృష్టించిన దీపా మెహతా ఇప్పుడు ఎర్త్ అనే సినిమా తీస్తోంది. అయితే ఈ సినిమాకి మొదట అక్షయ్ ఖన్నా, చంద్రచూడ్ సింగ్‌లని అనుకుని కుదరక అమీర్‌ఖాన్‌నీ, అక్షయ్ ఖన్నా తమ్ముడు రాహుల్ ఖన్నానీ పెట్టుకొంది. తాను చెయ్యాక పోయినా తన తమ్ముడు రాహుల్ చేస్తున్నందుకు ఆనందంగా ఉందని సర్దుకుంటున్నాడు అక్షయ్.

